క్లుప్తంగా

డి.భీమవరం ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన న్యాయమూర్తి


అపరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న న్యాయమూర్తి బాబు

అడ్డతీగల: మండలంలోని డి.భీమవరం ఆశ్రమ ఉన్నత పాఠశాలను అడ్డతీగల జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి పి.బాబు మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వసతి గృహంలో మౌలిక సదుపాయాలు క్షుణ్ణంగా పరిశీలించారు. మరుగుదొడ్ల వద్ద పారిశుధ్యం సరిగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు.ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులను కొన్ని సబ్జెక్టులపై ప్రశ్నించి, సరైన సమాధానాలు రాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. మంచి ఫలితాల సాధనకోసం మెరుగైన బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.న్యాయవాదులు కె.ఎస్.వి.రమణ, డి.శ్రీధర్,ఇ.గౌరీశంకర్ కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పెద్ద మృతికి ఎమ్మెల్యే సంతాపం


బొంజునాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: మండలంలో పెదలోచలి పంచాయతీ కేంద్రానికి చెందిన గ్రామ పెద్ద లోచలి బొంజునాయుడు మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు పెదలోచలి గ్రామానికి వెళ్లి బొంజునాయుడు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బొంజునాయుడు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు మత్స్యంనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టర్ వంశీకి ఆర్థిక సాయం


వంశీతో ఫౌండేషన్ చైర్మన్ వెంకటరామరాజు

ఎటపాక: అంతర్జాతీయ వెయిట్ లిఫ్టర్ వంశీకి వసుధ ఫౌండేషన్ మంగళవారం ఆర్థికసాయం అందజేసింది. భద్రాద్రి ఏజెన్సీ ప్రాంతానికి చెందిన మొడెం వంశీ దాతల సహకారంతో వెయిట్ లిఫ్టింగ్‌లో రాణిస్తున్నాడు. అతడికి ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు అభినందించి రూ.30వేల నగదు అందజేశారు. మరెన్నో పోటీల్లో ప్రతిభ చాటి ఏజెన్సీకి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

బాల్య వివాహాలతో ఇబ్బందులు

చింతూరు: చిన్న వయసులో వివాహాల కారణంగా ఎన్నో ఇబ్బందులు తలెత్తుతాయని, బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని చింతూరు సీడీపీవో విజయగౌరి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల విద్య, ఆరోగ్య పరంగా ఎంతో నష్టపోతారని, ఆకర్షణలకు లోనుకాకుండా శ్రద్ధగా విద్యనభ్యసించి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎలిజబెత్, ఐసీడీఎస్ సిబ్బంది ప్రియాంక, రాజు, రవి, గణేష్ పాల్గొన్నారు.

ఘనంగా కోటకొండమ్మతల్లి జాతర

గొలుగొండ : చోద్యం గ్రామంలో మంగళవారం కోటకొండమ్మతల్లి జాతర ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని దర్శనానికి భక్తులు బారులు తీరారు. ప్రతి ఏటా ఇక్కడ అమ్మవారి జాతరను పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలంకరణ, బాణసంచా నడుమ రాత్రి అమ్మవారికి ఊరేగింపు నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

గూడెంకొత్తవీధి: ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలని, వాతావరణ పరిస్థితులు, విపత్తులను తట్టుకునే సామర్థ్యం ఉండటం వల్ల రైతులకు లాభదాయకమని, భూమితో పాటు ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ బోయిన కుమారి సూచించారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కోరారు.దూదరిపాలెం,రింతాడలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ విపరీతంగా రసాయనాలు, పురుగుమందుల వినియోగం వల్ల భూమి సారం తగ్గుతుందని చెప్పారు. శాస్త్రవేత్త బాలహాస్పేన్ రెడ్డి మాట్లాడుతూ యంత్రాల సహాయంతో సాగు చేస్తే అధికంగా లాభాలు పొందవచ్చని సూచించారు.సాగులో పాటించాల్సి మెళకువలను వివరించారు. తెగుళ్ల రాకుండా చేపట్టాల్సిన చర్యలు సూచించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ఏడీఏ కె.జాహ్నవి, సర్పంచ్ రమేష్,ఏవో మధుసూదన్, వెటనరీ వైద్యులు రాజశేఖర్ పాల్గొన్నారు.

జి.మాడుగుల: వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది అందజేసే సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు కృషి చేయాలని మండల వ్యవసాయాధికారి పాత్రుడు తెలిపారు. మండలంలో సుర్మతి పంచాయతీ వాకపల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పొలం పిలుస్తోంది పోస్టర్‌ను సర్పంచ్ సూరిబాబు, వ్యవసాయ సిబ్బంది, రైతులు ఆవిష్కరించారు. అనంతరం పాత్రుడు మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఏఈవో ప్రశాంత్, అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రతి, జెడ్‌పీఎన్ఎఫ్ సిబ్బంది తేజ, వెంకటలక్ష్మి, రాజుపడాల్, రైతులు పాల్గొన్నారు.

అధిక లాభాలు వచ్చే పంటలు వేయాలి

చింతపల్లి: రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే పంటలు సాగుచేయాలని ఏవో శ్రీనివాసరావు సూచించారు. కొత్తపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం వల్ల కలిగే లాభాలను వివరించారు. పరిశోధనా స్థానం శాస్త్రవేత్త ఉజ్వల రాణి, వెటనరీ వైద్యులు దమయంతి,వెంకట రమణ,వీపీ కృష్ణ పాల్గొన్నారు.

కొయ్యూరు: వరిలో ఆకుముడత తెగులు నివారణకు 0.6 గ్రాముల ట్రై సైక్లోజల్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఏవో ఉమాదేవి రైతులకు సూచించారు.ఆమె మంగళవారం కొండగోకిరి, రావణాపల్లి రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాంత్రీకరణతో లాభాలు, తీసుకోవలసిన చర్యలను వివరించారు. వెటనరీ వైద్యులు రాజేష్‌కుమార్ మాట్లాడుతూ పశువులకు వచ్చే వ్యాధులు, తీసుకోవలసిన చర్యలను సూచించారు.రావణాపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు ఏవోను కోరారు.

పొటాష్‌తో వ్యాధి నిరోధకశక్తి వృద్ధి

చింతూరు: వరిపంటకు చిరు పొట్టదశలో పొటాష్ వాడకం వల్ల వ్యాధి నిరోధకశక్తి వృద్ధి చెంది, ధాన్యం బరువు పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కుమ్మూరు, మామిళ్లగూడెం, చట్టిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ స్మార్ట్‌ఫోన్లను వినియోగించి చీడపురుగులు, తెగుళ్ల నివారణ, యాజమాన్య పద్ధతుల గురించి తెలుసుకోవచ్చని తెలిపారు.


సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ బోయిన కుమారి


వాకపల్లిలో పొలం పిలుస్తోంది వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏవో పాత్రుడు


కొత్తపాలెంలో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


పొలం పిలుస్తోంది పోస్టర్లతో అవగాహన కల్పిస్తున్న ఏవో ఉమాదేవి


రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారి శ్రీనివాసరావు


గొందోలులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వ్యవసాయ సిబ్బంది

అడ్డతీగల: రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని అడ్డతీగల సహాయ వ్యవసాయ సంచాలకులు కె.సావిత్రి అన్నారు.అడ్డతీగల మండలం గొందోలు,డి.భీమవరం రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. వ్యవసాయాధికారి ఎం.సువర్ణకుమారి మాట్లాడుతూ ఈ పంట నమోదును తప్పనిసరిగా ప్రతి రైతు చేయించుకోవాలన్నారు.

పశుసంవర్ధకశాఖ ఏడీ గణేష్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గొర్రెలు,మేకలు,ఆవులు,కోళ్లకు వ్యాక్సిన్ వేస్తున్నట్టు తెలిపారు ఈ కార్యక్రమంలో బొడ్లంక సర్పంచ్ బోనెం రాఘవ,డిప్యూటీ తహసీల్దార్ తేజస్విని పాల్గొన్నారు.

బర్భులలో కనీస సౌకర్యాలు కరవు


కనీస సదుపాయాలు కల్పించాలని కోరుతున్న గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు

పెదబయలు: మండలంలోని మారుమూల కొరవంగి పంచాయతీ బర్భుల గ్రామంలో కనీస సౌకర్యాలు లేక గ్రామస్తులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని వైఎస్సార్ సీపీ మండల నాయకులు బొండా విజయ్‌కుమార్,పోయిభ కోటేశ్వరరావు తెలిపారు. ఆ గ్రామాన్ని వీరు సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో 50 కుటుంబాల వారు నివాసముంటున్నారని, కనీస సౌకర్యాలు లేక అవస్థలకు గురవుతున్నారని చెప్పారు. గ్రామానికి వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేదని తెలిపారు. గ్రామంలో సుమారు 38 మంది బడిఈడు పిల్లలున్నారని, వీరింతా ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్న బొడ్డగొంది పాఠశాలకు వెళ్లాలని తెలిపారు. కొంత మంది విద్యార్థులు కొండలు, గెడ్డలు దాటుకుంటూ వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందడం లేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గల్లేల లక్ష్మణరావు పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత నివారణ


సొవ్వాలో మాట్లాడుతున్న సీడీపీవో నీలిమ


కొంతలంలో గర్భిణులకు సీమంతాలు జరుపుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు


బాలరేవులలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, సీడీపీవో విజయకుమారి

డుంబ్రిగుడ: సంపూర్ణ పోషకాహారంతో రక్తహీనతను నివారించవచ్చని సీడీపీవో నీలిమ తెలిపారు. మండలంలోని సొవ్వా క్లస్టర్ పరిధిలోని ఒడియవలస అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించి, పోషకాహారాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు, కిశోర బాలకలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు,అంగన్‌వాడీకార్యకర్తలుపాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని చినబంధవీధి సెక్టార్ పరిధి కొంతలం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ సీడీపీవో జి.సువర్ణకుమారి ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ పౌష్టికాహారం, బాల్యవివాహాల గురించి అవగాహన కల్పించారు. ముందుగా సూపర్‌వైజర్లు, తల్లులు కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు ఎస్.వి జయలక్ష్మి, ఎస్.సత్యవతి, ఎం.లక్ష్మి, డి.పద్మావతి, లక్ష్మి, మణికుమారి తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్ లక్ష్మి

కొయ్యూరు: సంరక్షణ కేంద్రాల్లో ప్రసవాలు సురక్షితమని, గర్భిణులు కేంద్రాల్లో సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో విజయకుమారి సూచించారు.బూదరాళ్ల పంచాయతీ బాలరేవులలో మంగళవారం పోషణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజేంద్రపాలెం ఆస్పత్రిలో గర్భిణులు సంరక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనంతరం పౌష్టికాహార ప్రాధాన్యతను వివరించారు. అంతకుముందు అవగాహన ర్యాలీ, సామూహిక సీమంతాలు నిర్వహించారు. సూపర్‌వైజర్లు కొండమ్మ,సునీత, సీనియర్ సహాయకులు ప్రవీణ్ పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న సేవలు బాలింతలు,గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మి తెలిపారు. మండలంలోని చొంపి,పద్మపురం పంచాయతీల పరిధిలో మహిళలకు పౌష్టికాహారం, బాల్య వివాహలపై మంగళవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని చెప్పారు. సర్పంచ్ సుభద్ర,ఎంపీటీసీ సభ్యురాలు సోమెల్లి జానకమ్మ, సూపర్ వైజర్ పార్వతి, మహిళ పోలీసు భవాని పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభం


చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు


ఖోఖో ఆడుతున్న దృశ్యం


కబడ్డీ ఆడుతున్న బాలికలు

అరకులోయటౌన్: స్థానిక క్రీడా పాఠశాల మైదానంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ ఎంపిక పోటీల్లో అండర్-14, అండర్-17 విభాగంలో బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్,యోగ, షటిల్ పోటీలు నిర్వహించారు. అండర్-14, 17 విభాగాల్లో 306 మంది చొప్పున 612 మంది బాలికలు పాల్గొన్నారు. బుధవారం బాలురకు పోటీలు నిర్వహించి ఎంపిక చేస్తామని జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ కొండబాబు తెలిపారు. ఎంపికైన వారు ఉమ్మడి జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని హెచ్‌ఎంలు కిల్లో కెందు, మోరి జాన్,మూర్తి, తాంగుల మోహన్‌రావు ప్రారంభించారు. స్కూల్ గేమ్స్ మాజీ సెక్రటరీ పాంగి సూరిబాబు, అసిస్టెంట్ సెక్రటరీ కిల్లో బాలి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు కిల్లో అప్పలరాజు, భూపతిరాజు, ఆర్. కొండబాబు, బాలన్న, చందర్‌రావు, కమల్, శారద, అశోక్ కుమారి, ఆరు మండలాల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పాఠశాల గేటును యథాతథంగా ఏర్పాటు చేయాలి

డుంబ్రిగుడ: కించుమండ గిరిజన ప్రాథమిక పాఠశాలో తొలగించిన గేటును యథాతథంగా ఏర్పాటు చేయాలని ఆ పాఠశాల విద్యార్థుల తలిదండ్రులు జాతీయ రహదారి 516ఇ వద్ద ఆందోళన చేశారు. ఆ పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఆనుకుని ఒకే దగ్గరగా ఉన్నాయన్నారు. బాలుర ఆశ్రమ పాఠశాలకు ప్రధాన గేటు ఉండగా, చిన్నారులకు ప్రత్యేకంగా మరో గేటు ఉండేదని చెప్పారు. అయితే ఆశ్రమ పాఠశాల యాజమాన్యం చుట్టూ ప్రహరీ నిర్మించడంతో గేటును తొలగించారని చెప్పారు. దీంతో చిన్నారులు జాతీయ రహదారి 516ఇ మీదుగా పాఠశాలకు చేరుకుంటున్నారని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని భయాందోళన వ్యక్తం చేశారు. గేటును యథాతథంగా ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నా సంబంధిత ఆశ్రమ పాఠశాల యాజమాన్యం పట్టించుకోవడం లేదని చెప్పారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి గేటును ఏర్పాటు చేయాలని కోరారు. రెండు పాఠశాలలు ఒకే పరిధిలో ఉండడంతో ప్రధాన గేటు ద్వారా పాఠశాలకు చేరుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులకు సూచించడం జరిగిందని ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గెన్ను తెలిపారు. ఈవిషయమై సోమవారం సాయంత్ర పాఠశాలకు విచ్చేసిన జిల్లా విద్యాశాఖ అధికారితో గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడారని చెప్పారు.


ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

సాదాసీదాగా పాడేరు మండల సమావేశం

పాడేరు : పాడేరుమండల సర్వసభ్య సమావేశం మంగళవారం సాదాసీదాగా సాగింది. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు సమాచారం ఇచ్చినప్పటికీ అధికారులు సకాలంలో సమావేశానికి హాజరు కాలేదు. సమావేశాన్ని నిర్వహించవలసిన మండల ప్రత్యేకాధికారి, వెలుగు ఏపీడీ సమావేశానికి డుమ్మా కొట్టారు. హాజరైన అధికారులు కూడా సమస్యలపై స్పష్టమైన సమాచారం ఇవ్వకపోవడంపై వైఎస్సార్‌సీపీ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో పలువురు మాట్లాడుతూ మండలంలో నేటికి చాలా చోట్ల మండల పరిషత్ పాఠశాలలకు పూర్తి స్థాయి భవనాలు లేవని తెలిపారు. పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కారం కానప్పుడు మండల సర్వసభ్య సమావేశాలు నిర్వహించడం ఎందు కని అధికారులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సొనారి రత్నకుమారి, ఎంపీడీవో సాయి నవీన్, తహసీల్దార్ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు.



స్వర్ణాంధ్ర పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎంపీడీవో, తహసీల్దార్, ఎంపీపీ

సమాజ సేవలో విద్యార్థుల భాగస్వామ్యం అవసరం


చింతపల్లిలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయభారతి


మర్రిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం


సర్టిఫికెట్లతో అరకులోయ డిగ్రీ కళాశాల విద్యార్థులు

చింతపల్లి: విద్యార్థులు సమాజ సేవా కార్యక్రమాల్లో తప్పనిసరిగా పాల్గొనాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి సూచించారు. జాతీయసేవా పథక దినోత్సవంలో భాగంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎల్.శ్రీనివాస్ పాత్రుడు, అధ్యాపకులు వి. రమణ,రవీంద్రనాయక్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఈశ్వరరావు, పావని,కేజీయ, అశోక్‌బాబు పాల్గొన్నారు.

కొయ్యూరు: విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని మర్రిపాలెం మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ తెలిపారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సేవతో పాటు వితరణ కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మహాలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పీవో మంగమ్మ, అధ్యాపకులు కుమారి, పుష్ప శ్రీనివాస్,వెంకటరమణ శ్రీనివాస్, భువన,సౌమిత్రి,సీత విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

చింతూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవాపథక దినోత్సవాన్ని అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సేవా దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. సేవా కార్యక్రమాలతో వ్యక్తిత్వ వికాసంతో పాటు నాయకత్వ లక్షణాలు అలవడతాయిన చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్, అధ్యాపకులు వెంకటరావు, నాగేశ్వరరావు, హారతి, సాయికుమార్, పద్మ, శకుంతల, అప్పనమ్మ, శైలజ పాల్గొన్నారు.

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవ పథం ఆధ్వర్యంలో మంగళవారం ఎన్ఎస్ఎస్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భరత్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ఆవిర్భావం, లక్ష్యాలను వలంటీర్లకు వివరించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు వై.విజయలక్ష్మి, పసుపులేటి నాగబాబు, మొష్యా అనిత కుమారి మాట్లాడుతూ మై భారత్ పోర్టల్ , డిజిటల్ లిటరసీ గురించి వలంటీర్లకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా నిర్వహించిన 5కె రన్, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రిన్సిపాల్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పుష్పరాజ్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.కొండబాబు, కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం


రక్తదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవ-2024, జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల క్షతగాత్రుల ప్రాణాలు కాపాడవచ్చన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ వలంటీర్లు, స్కిల్ హబ్ స్టూడెంట్స్, అధ్యాపకులు, స్థానికులు స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లు తెలిపారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషిరెడ్డి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరం ద్వారా 45 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డి.రవికుమార్, డాక్టర్ హారిక తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా చలపతిరావు


చలపతిరావును అభినందిస్తున్న అధ్యాపకులు

అరకులోయ రూరల్: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పట్టాసి చలపతిరావును నియమించారు. ఇక్కడ పిన్సిపాల్‌గా పని చేస్తున్న రామకృష్ణ వ్యక్తిగత సెలవుపై వెళుతుండడంతో చలపతిరావును అదనపు ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల పిన్సిపాల భరత్ కుమార్ నాయక్, అధ్యాపకులు ఆయనను అభినందించారు.